# తుడుం (నగారా)

గోదావరి

నారేపచెట్టు కొసకంటాపాకి మరోమారు గొంగడిముసుగు సరిచేసుకొని తేనె తుట్టెవేపు దృష్టిసారించాడు భిక్యా. ఇంకొంచెంపాకాలి– అట్లాపాకుతుండగానే అనుకోకుండా కొండకిందికి దృష్టిసారించాడు– అల్లంతదూరాన కాకిబట్టలోల్ల గుంపు కనిపించింది– కాకిబట్టలోల్లముందు ఇద్దరు తెల్లబట్టలోల్లు నడుస్తున్నారు. భిక్యా జడ్రిన కిందికిజారి కొండమీదినుండి కిందికి పరుగెత్తసాగిండు గాలికన్నవేగంగా.

కొండ కిందిభాగంలో గూడానికొచ్చేదాకా అతను పరుగెత్తుతూనే ఉన్నాడు– గూడెంలో మొత్తంకలిపి ఇరువైగుడిసెలున్నాయి. కాలుగాలిన పిల్లిలా గుడిసె గుడిసెకు పరుగెత్తాడు– నలుగురైదుగురు లేవలేని ముసలివాళ్లు, జ్వరంతో మంచానికంటుకపోయిన ఒక పడుచువాడు– ఇద్దరు ముగ్గురు పిల్లలుతప్ప ఎవరు కనిపించలేదు. కాసేపు ఏమిచేయాలో తోచక పొద్దుకేసిచూస్తూ నిలుచున్నాడు– పొద్దు అంగుడలకొచ్చింది– తలగోక్కున్నాడు– ఎటూనిర్ణయించుకోకుండానే [1] మిట్టమీదికురికి మళ్లీ చూశాడు– వాళ్లు వచ్చేస్తున్నారు. ఎట్లా ? ఎట్లా ? అట్లా గుంజాటనపడుతూనే కడింటికేసి పరుగెత్తాడు– గుడిసెలోపల ఎవరూలేరు– కొయ్యకుగట్టిన ఎర్రజెండా ఊడపీకి దాచేశాడు– నాలుగైదు ఎర్రకాయిదాలుతీసి చూర్లోచెక్కాడు– అప్పుడు కనిపించింది అతనికి తుడుం.

తుడుం పట్టుకొని కొండమీదికి పరుగెత్తాడు– మరోపదినిమిషాల్లో కాకిబట్టలోల్లు గూడెంలో ప్రవేశించడం నగారా మోగడం ఒక్కసారేజరిగాయి.

గూడెంలోకి అడుగుపెట్టిన కాకిబట్టలవాళ్ల నాయకుడు బెదిరి బెదిరి చూశాడు. అతని ఉబ్బుచెంపల మీదికంటా చెమట అసహ్యంగా కారుతుండగా– "బి. క్విక్– గుడిసెల్లో వెతకండి." ఆర్డరేశాడు– కాకిబట్టలోల్లు విజృంభించి కర్రలూపుతూ గుడిసెల మీద పడ్డారు– గిరిజనులకు విలువైన కుండలు పగులగొట్టారు. తునికిపళ్లు తొక్కేశారు– [2] కంకబెనం ఎగజల్లారు– ఇప్పపూవు పారబోశారు. ఉన్నవాళ్ళను నాయకుని దగ్గరికి ఈడ్చుకొచ్చారు. నాయకుడు [3] గడంచ తెప్పించుకొని అప్పటికే కొలువుదీరాడు

అర్ధగంట గడిచింది. గుడిసెల్లో గాలింపు అయిపోంది– నాయకుడికి ప్రమోషన్ ఆశ చావబోతోంది– తెల్లబట్టలోల్ల కళ్లల్లో భయం తెప్పరిల్లింది– కాకిబట్టలోల్లకు అథవా ఒక ఆడపిల్లన్నా దొరుకక మహాపెడ్డ [4] నాదానుగా ఉన్నది.

---

1 ఎత్తైన ప్రదేశం 2 కంక చెట్ల నుండి తీసే గింజలు(గిరిజనులు వండుక తింటారు)

3 చిన్న మంచం 4 నామోషిగా

సరిగ్గా అలాంటి సమయంలో ఊపపక్కన చేకుపొరకల్లోనుండి అరుపులు వినిపించాయి- పరికాసేపటికి మట్టిపెళ్లలు దొర్లుతున్నట్లుగా మనుషులు పరుగెత్తుకొచ్చారు- నాయకుడులేచి అటెన్‌షన్‌లో నిలబడినాడు- తెల్లబట్టలోల్ల కాళ్లు వనుకుతున్నాయి. పదినిముషాల సమయంలోనే కాకీబట్టలోల్ల చుట్టు అయిదారు వందల జనం పోగయ్యారు. ఇంకా వచ్చేవాళ్లు వస్తూనేఉన్నారు.

నాయకుడు ముఖంలోని భావాలను చిత్రంగా మార్చాడు- అతనిముఖంలో కృత్రిమైన ప్రశాంతత. గొంతులో అలవాటులేని మార్దవం- "మీరేం భయపడవద్దు- మేం మిమ్మలనేంచేయం- కాని మీరుమాకు...." నాయకుడు తెల్లబట్టల వాళ్లకేసి చూశాడు.

తెల్లబట్టల ఎద్దుముఖం వాడొకడు "పొరకల పాట్లోల్లు దొంగలు- మిమ్మల నిండముంచుతరు" అన్నాడు వొనుకుతూనే.

ఖాకీనాయకుడు చిరాకుపడ్డాడు- తెల్లబట్టల బక్కవాడు "రాడికలోల్లు మీకు మంచివాల్లే కావచ్చుగాని సర్కారుకు శత్రువులు- మరందుచేత వాల్లెవరన్నాఉంటే సర్కారోల్లకప్పగియ్యండ్లి."

గిరిజనులు మాట్లాడలేదు- ఒకరిముఖాలొకరు చూసుకున్నారు- వెనుకవాళ్ళకిపేమి వినిపించక అరుస్తున్నారు.

"సర్కారుమీకు కోటి రూపాయలు మంజూరు జేసింది" ఖాకీనాయకుడు.

ఎద్దుముఖంవాడు చిన్నగాదగ్గి- "మీకు సాయపడుతుంది సర్కారు" అన్నాడు.

ఈసారి రేగుతుట్టెలాగా వెంట్రుకలుగల ఒకస్త్రీ ముందుకొచ్చింది- "గినేండ్లు మేం సచ్చినమో బతికినమో సూడని సర్కారుకు దయెట్ల గలిగిందొంట-" అన్నది చేతులుతిప్పుతూ.

బక్కపలుచటివాడు తలగోక్కున్నాడు.

"మీవూళ్ళకు [5] సడుకులేపిత్తది-" ఎద్దుముఖం.

"మాకు కాళ్లున్నాయి" స్త్రీ.

"మీ మోటర్ల కోసమా?" వెనుకలైనులోనుంచి బొంగురుగొంతు.

"మేకలగొనిస్తది?"

"అవి ఏడమెయ్యాలె- [6] సైకిదారు [7] పుల్లరని కోసుకుంటరు." జనంలోనుండి-

"మీకు ఎడ్లుగొనిస్తది?"

---

5. రోడ్లు 6. ఫారెస్టర్ 7. అడివిపన్ను

"8 కంకలగట్టి ఏడదున్నుదుం. సర్కారు ఉన్నభూమి రిజర్వోల్లదనే-'

"మీకు అప్పులిస్తది."

"ఎన్నేండ్లు?"

ఎద్దుముఖంవాని ముఖంలో కోపం.

"ఇయ్యేడిత్తది. మసంబువ్వకు కర్సుసేసుకున్నంక 8 బొండిగలకురిబెడ్తది."

"మాదెర్‌సోదు మీరంతా సక్సలైట్లు" ఖాకీ నాయకుడు పళ్లు పటపట కొరికాడు ఖాకీబట్టలవాళ్ళు నలుగైమంది తుపాకులెత్తారు.

జనం ఆరువందలు దాటారు- తిట్లుశాపనార్థాలు- ఖాకీబట్టలవాళ్ళ చుట్టున్నజనం ఇంకా ఏదో అడుగుతూనే ఉన్నారు- చక్రబంధంలో చిక్కుపోయిన ఖాకీవాళ్ళు ఏదో చెప్పుతూనే ఉన్నారు- మాటలు అయిపోయాయి. ఖాకీవాళ్ళు కర్రలెత్తి ముందువరస లోని వాళ్ళను కొడుతున్నారు- వెనుకున్నవాళ్ళు హడావిడిలో ఉన్నారు.

మరో అర్ధగంటలో దెబ్బలుతిన్న ముందువరుసవాళ్ళు వెనక్కుపోయారు- చుట్టూ 9 నువ్వుకట్టెమధ్య ఖాకీవాళ్ళు ఇరుక్కుపోయారు.

ఖాకీనాయకుడు కీచుగొంతుబడి "ఫైర్ ఫైర్"అని అరుస్తున్నాడు కాని ఆ అరుపు ఎవరికీ వినపడటంలేదు. మరింక లాభంలేదని సంజ్ఞకోసం చేతులెత్తాడు.

"10 అగ్గిదగ్గబెడ్తం." అరుపులు.

ఖాకీనాయకుడు పిచ్చిగా చేతులూపాడు- రెండుమూడు తుపాకులు గాలిలోకి మొరిగినయ్- నాయకుడు అదిరిపడి చేతులూపడం ఇంకా ఎక్కువచేశాడు....

గిరిజనులు నువ్వుకట్టెలెత్తుకుటూ విరుచుకపడ్డారు. అందరిచేతుల్లో కర్రలున్నాయి. పెటేల్ పెటేల్‌స దెబ్బలు- ఖాకీవాళ్ళు మూడునాలుగు భాషల్లో మొత్తుకుంటున్నారు. గాబరాగా తుపాకులు సదురుతున్నారు- తమప్రాణంకన్న విలువగా వాటిని గుండెలకదుముకుంటున్నారు. ఇంకా చేకుపొరకల్లోనుండి పరుగెత్తుకొస్తున్న గిరిజనుల అరుపులు వినవస్తూనే ఉన్నాయి.

మరో అయిదు నిమిషాలకు ఖాకీనాయకుడు ముందు, తెల్లబట్టలోల్లు వెనుకా వాళ్ళవెనుక చిరిగి వేలాడుతున్న ఖాకీగుడ్డలవాళ్లు పరుగెత్తుతున్నారు.

కొండతిరిగేదాకా గిరిజనులు వెంటబడి తరుముతూనే ఉన్నారు.

---

8. గోండుభాషలో ఎడ్లుఅనిఅర్థం 8. మెడకు 9. నువ్వుమొక్కల ఎండుచెత్త
10. నిప్పులంటిస్తాం.